క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌ను సన్మానించిన నాయకులు


మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ అజీజ్‌పాషా, అబ్దుల్ మజీద్, ఎస్.సుబ్బరాజు, పి.రామరాజు, జె.సైదులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వృత్తి నైపుణ్య శిక్షణ


ముగింపు కార్యక్రమంలో నిర్వాహకులను సన్మానిస్తున్న లబ్ధిదారులు

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో 15రోజులుగా న్యాక్ సంస్థ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు వృత్తి నైపుణ్యంపై ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. అనంతరం కార్మికులు ట్రైనర్ కరుణసాగర్, నిర్వాహకుడు బుచ్చిరాములును సన్మానించారు. కార్యక్రమంలో 30మంది భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి బాధాకరం

కోదాడఅర్బన్ : ఏపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సంఘం ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. మంచి గళం ఉన్న ఉపాధ్యాయ ఉద్యమనేతగా, ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ యూటీఎఫ్ నాయకుడిగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడిన నాయకుడు షేక్ సాబ్జీ అని వారు కొనియాడారు. కార్యక్రమంలో ఆడిట్ కమిటీ సభ్యులు టీపీ జనార్దన్, అనంతగిరి, కోదాడ మండల శాఖ అధ్యక్షులు ఉపేందర్, ఆంజనేయులు, పిచ్చయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన


సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ రమేష్

గరిడేపల్లి : మండల పరిధిలోని కొండయ్యగూడెం గ్రామంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంపీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు గానుగుబండ ఎంపీటీసీ పాకాల రమేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరస్వామి, కందుల కోటిరెడ్డి, బచ్చలకూరి కృష్ణప్రసాద్, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగేంద్రబాబు, దామోదర్‌రెడ్డి, నాగిరెడ్డి, దస్తగిరి, అంజిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీరబాబు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

గరిడేపల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు యాకూబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు బిల్లులతో పాటు వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, నూతన ప్రభుత్వం వెంటనే బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాత బిల్లులు చెల్లించి ఇచ్చిన హామీ ప్రకారం రూ.10వేల గౌరవవేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వెంకటరమణ, నాగమణి, సైదమ్మ, విజయ, నాగేంద్ర, విజయలక్ష్మి, మంగమ్మ, భవానీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలుకూరు : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ సైదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

టేలాండ్‌లో యాసంగికి గడ్డుకాలం

- సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల లేకపోవడంతో అరకొరగా వరినాట్లు
- బోర్లు, బావుల కిందనే సాగు
- వ్యవసాయ మోటార్లకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని రైతుల వేడుకోలు


చౌటపల్లి వద్ద అరకొరగా వేసిన యాసంగి వరినాట్లు


మండలంలో బోర్ల కింద సాగు చేస్తున్న వరిపొలాలు

మఠంపల్లి : వర్షాభావ ప్రభావంతో ప్రాజెక్ట్‌లలో నీరులేకపోవడంతో టేలాండ్‌లో యాసంగి వరిసాగుకు గడ్డుకాలం ఏర్పడింది. దీంతో మండలంలో సగానికిపైగా వరిసాగు తగ్గిపోనుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ఎడమకాలువకు అనుసంధానంగా ఉన్న ముక్త్యాలబ్రాంచ్ కెనాల్ ద్వారా మండలంలో మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్‌ల పరిధిలో యాసంగికి సాగునీరు విడుదలయ్యేది. కాని వర్షాభావ పరిస్థితులతో ఆ అవకాశం లేకపోవడంతో మండల పరిధిలోని ఆయకట్టు చివరి భూములు (టేలాండ్) రైతులు బోర్లు, బావులు కింద మాత్రమే అరకొరగా వరినాట్లు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఎస్‌ఎస్పీ పరిధిలో మట్టపల్లి, గుండ్లపల్లి మేజర్‌ల కింద సుమారు 10వేల ఎకరాలు, వేములూరు రిజర్వాయర్ ఎడమ, కుడి కాలువలు, ఊరచెరువుల ఆధారంగా సుమారు 6వేల700ల ఎకరాల సాగుతో పాటు మరో 5వేల ఎకరాల వరకు బోర్లు, బావుల కింద రైతులు సాగుచేస్తుంటారు. అయితే ఈఏడాది నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో సరిపడా నీరు లేక ఎడమ కాలువకు నీటివిడుదల పూర్తిస్థాయిలో జరగలేదు. అయినప్పటికీ మండలంలోని మఠంపల్లి, చౌటపల్లి, బక్కమంతులగూడెం, అల్లీపురం, పెదవీడు, యాతవాకిళ్ల, చెన్నాయిపాలెం, బీల్యానాయక్‌తండా, హనుమంతులగూడెం, వర్ధాపురం గ్రామాల పరిధిలోని ఆయకట్టు, చివరి ఆయకట్టు రైతులు యాసంగిలో సాగుకు సన్నద్ధమయ్యారు. దానిలో భాగంగా బోర్లు, బావుల ఆధారంగా మండల వ్యాప్తంగా సుమారు 10వేల ఎకరాలలో వరినాట్లు వేసేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో అరకొరగా వరినాట్లు వేస్తున్నారు. అయితే ప్రభుత్వం విద్యుత్ అధికారులు మండలంలోని టేలాండ్ భూముల్లో సాగుచేస్తున్న వరిపొలాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు వారబందీ విధానంతోనైనా ఎస్‌ఎస్పీ నీటిని మేజర్‌ల ద్వారా విడుదలచేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలి



మండలంలోని టేలాండ్‌లో యాసంగి వరినాట్లు సాగునీరు విడుదల చేయకపోవడంతో బోర్ల కిందనే రైతులు వరిసాగు చేస్తున్నారు. రైతులను ఆదుకునేందుకు విద్యుత్ అధికారులు వ్యవసాయ మోటార్లకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి. – గాదె జయభారత్‌రెడ్డి, మఠంపల్లి

వారబందీగా సాగునీరు విడుదల చేయాలి



మండలంలోని ఆయకట్టు, చివరి ఆయకట్టు రైతులు యాసంగిలో సాగుచేస్తున్న కొద్దిపాటి వ్యవసాయ పొలాలకు వారబందీ విధానంలోనైనా సాగునీరు విడుదల చేసేందుకు ఎన్‌ఎస్పీ అధికారులు చొరవచూపాలి. సాగునీరు లేకపోవడంతో బోర్లు, బావుల కింద రైతులు కేవలం 40 నుంచి 50శాతం వరకే వరినాట్లు వేసే అవకాశం ఉంది. – బోగాల పిచ్చిరెడ్డి, మాజీసర్పంచ్ అల్లీపురం

కేసుల రాజీకి కక్షిదారులు సహకరించాలి

- జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి అమరావతి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అమరావతి

హుజూర్‌నగర్ : కేసుల రాజీకి కక్షిదారులు సహకరిస్తే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి అమరావతి అన్నారు. ఈనెల 30న హుజూర్‌నగర్‌లో జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహణపై శుక్రవారం స్థానిక కోర్టు హాల్లో పోలీసులు, న్యాయవాదులు, మీడియాతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుజూర్‌నగర్ న్యాయస్థానం నుంచి గత లోక్ అదాలత్‌లో పెద్ద మొత్తంలో కేసులు రాజీ కావడానికి ప్రతిఒక్కరూ సహకరించారని అదే ఒరవడిని రాబోయే లోక్ అదాలత్‌లోనూ కొనసాగించాలని కోరారు. వివిధ రకాల కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశాల్లో సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్, న్యాయవాదులు, ఎస్‌ఐలు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ వేణుగోపాల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం దేవాలయంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలకు పూజలు చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం సుప్రభాతం, విష్ణుసహస్ర నామం, గోదా, రామానుజ అష్టోత్తరాలు, తిరుప్పావై సేవాకాలం, సాయంత్రం పల్లకిసేవ, విశేషమైన వాహన సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెలరోజుల స్వామి వారికి ప్రత్యేక అలంకారాలు, భక్తుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు దేవాలయానికి రంగులను వేయించి విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తులకు అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూజారులు, స్థానాచార్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి


పెదవీడు గ్రామపంచాయతీలో రికార్డులు తనిఖీ చేస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి

మఠంపల్లి : మండలంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని పెదవీడు గ్రామపంచాయతీలో ఆమె రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రం, నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, హెచ్‌ఎం చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, బిల్ కలెక్టర్ కస్తాల నాగేష్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులున్నారు.

ఘనంగా సహస్రనామ కుంకుమార్చన


గోపూజలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో సహస్రనామ కుంకుమార్చన పూజా కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, అలంకరణ, పంచామృతాలతో అభిషేకం, మంగళశాసనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గోపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, యరగాని గురవయ్య – అనసూర్యమ్మ, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్ చార్యులు, మనోహరాచార్యులు, కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీ కంద, ఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈనెల 17నుంచి వచ్చేనెల 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి


సంపద వనాలను పరిశీలిస్తున్న ఎంపీపీ ఎలక బిందు, అధికారులు

మునగాల : సంపద వనాల పేరుతో ప్రభుత్వం నాటించిన నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించే బాధ్యత సిబ్బంది చేపట్టాలని ఎంపీపీ ఎలక బిందు కోరారు. శుక్రవారం మండలంలోని కృష్ణానగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎడమకాలువ కట్టపై ఏర్పాటు చేసిన సంపద వనాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం సక్రమంగా అమలయ్యే విధంగా గ్రామపంచాయతీ సహకారంతో ఉపాధిహామీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఉపాధి ఏపీఓ శైలజ, కృష్ణానగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్రా అనిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మాలధారులకు అన్నదానం


కోదాడఅర్బన్ : మాలధారులకు అన్న ప్రసాదాన్ని తీసుకొస్తున్న దాత


కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న దాత ఆదినారాయణ

కోదాడఅర్బన్ : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుంకర పుల్లయ్య, చట్టు నాగేశ్వరరావు, గురుస్వామి రామనాథం, మాలధారులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో శుక్రవారం మాలధారులకు దాత ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ అధికారి ఆదినారాయణ దంపతులు, చీదెళ్ల లక్ష్మణ్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, గడ్డం సూర్యరెడ్డి, సీతారాంసింగ్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నడిగూడెం : ఆర్థికసాయం అందజేస్తున్న సీఆర్పీలు

నడిగూడెం : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న గుంజ సౌందర్య భర్త యల్లయ్య ఇటీవల పలువురు దాడి చేయడంతో కోమాలోకి వెళ్లి ఇంటి వద్దే వైద్యం చేయించుకుంటున్నాడు. దీంతో సౌందర్య నిరుపేద కుటుంబానికి చెందినది కావడంతో జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు కలిసి సేకరించిన రూ.11,500ల ఆర్థికసాయాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో.ఆర్డినేటర్ నాగరాజు, సీఆర్పీలు నందిగామ రామారావు, రాజుల గురుస్వామి, మెసెంజర్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

మునగాల : మండలంలోని వెంకట్రాంపురం గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన ఎస్‌ఎంపేట గ్రామానికి చెందిన మండపల్లి సంతోష్, అతడి భార్య, పెద్ద కూతురు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో సంతోష్ కుటుంబంలో మిగిలిన మరో కుమార్తెను ఆదుకునేందుకు అతడి చిన్ననాటి స్నేహితులు ముందుకువచ్చారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99లో పదోతరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు రూ.2లక్షలు సేకరించి శుక్రవారం గ్రామంలో సంతోష్ కుమార్తె గగనకృష్ణ పేరు మీద బ్యాంకులో డిపాజిట్ చేసిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సంతోష్ మిత్రులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం ఆదర్శనీయం


కోదాడఅర్బన్ : పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కోదాడఅర్బన్ : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఆదర్శనీయమని పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత ఎంపీపీ కార్యాలయంలో, ప్రధాన రహదారిపై ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. న్యాయమైన హక్కుల కోసం ఆత్మ బలిదానం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. నేటి యువత ఆయన బాటలో నడువాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతిని వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రచ్చబండ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ వంగవేటి వెంకటగురుమూర్తి మాట్లాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు, తెలుగు వారి కోసం పోరాడిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. తెలుగు రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ మండల శాఖ అధ్యక్షుడు కాపర్తి మణికంఠకుమార్, కార్యదర్శి చక్కా కిశోర్, ఆర్యవైశ్య ప్రముఖులు నల్లపాటి శ్రీనివాస్, పీవీడీ.ప్రసాద్, వాసా శ్రీనివాస్, చిల్లంచర్ల శ్రీనివాస్, కందిబండ మంగేష్, గన్నవరపు వెంకన్న, బోనాల వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలత, ప్రధాన కార్యదర్శులు రాచకొండ శ్రీనివాస్‌లు, పాలిశెట్టి సత్యం, నటరాజ్, రామ్మూర్తి, కోటేశ్వర్‌రావు, వాసు ఉన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ చిల్లంచర్ల సత్యనారాయణ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ.జలీల్, పుల్లయ్య చౌదరి, వెంకటేష్, గోవర్దన్, సాయి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


నేరేడుచర్లలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు


మునగాలలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు


నడిగూడెంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కేవీకేను సందర్శించిన పాఠశాల విద్యార్థులు


సేంద్రియ సాగుపై విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని హౌజింగ్ బోర్డులో గల లిటిల్‌ఫ్లవర్ స్కూల్ ఏడోతరగతి విద్యార్థులు శుక్రవారం గడ్డిపల్లిలోని శ్రీ అరబిందో కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆగ్రోనమిక్ శాస్త్రవేత్త నరేష్ సేంద్రియ వ్యవసాయ విధానాలు, నూతన పద్ధతులపై విద్యార్థులకు వివరించారు. ఆధునిక పనిముట్ల సహాయంతో వ్యవసాయం ఆధునికరణ గురించి తెలియజేశారు. నేల సారాన్ని ఎలా పెంచాలి, మృత్తికా పరిరక్షణ, వాటి వలన మొక్కలకు ఏ విధంగా లాభం వంటి సాంకేతిక విషయాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జయరాజన్, ఉపాధ్యాయులు వినీష్‌కుమార్, జహంగీర్, షర్మిల, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలి

కోదాడఅర్బన్ : తెలంగాణలో కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని బీజేపీ కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా కొత్త రేషన్‌కార్డులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేక సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డులు ముడిపడి ఉన్నందున ప్రభుత్వం తక్షణమే రేషన్‌కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి

మోతె : బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి కె.గోపాల్‌రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కాంప్లెక్స్ పరిధిలో పనిచేసే సీఆర్‌పీలు అన్ని గ్రామాల్లో పర్యటించి బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించాలన్నారు. ఓఎస్‌సీ సర్వే ప్రకారం రాష్ట్రంలో బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలు నేటికి పాఠశాలకు వెళ్లడం లేదని గుర్తించడంతో ఈ సర్వే రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. సమావేశంలో సీఆర్‌పీలు శ్రీనివాస్, లింగస్వామి ఉన్నారు.

తాడువాయి బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిపివేత

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామ శివారులో గల గురప్పవాగుపై సుమారు రూ.2.60కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు గురువారం తాత్కాలికంగా నిలిచిపోయాయి. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ప్రారంభం నుంచే మందకొడిగా సాగుతున్నాయి. తాజాగా కాంట్రాక్టర్ బుధవారం నుంచి బ్రిడ్జి స్లాబ్ పనులను ప్రారంభించారు. కాగా స్లాబ్ కింద ఒకటో పిల్లర్ వద్ద ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కుంగిపోవడంతో పనులను అధికారులు నిలిపివేశారు. తొలుత కొందరు గ్రామస్తులు సెంట్రింగ్ రాడ్‌లు కుంగిన విషయాన్ని అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఉన్నతాధికారులు బ్రిడ్జి వద్దకు చేరుకొని పరిశీలించి పనులను నిలిపివేశారు. తిరిగి సెంట్రింగ్ సరిచేసి పనులను ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

రేపు 'పది' విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

కోదాడఅర్బన్ : పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ జూనియర్ కాలేజీలో పదో తరగతి విద్యార్థులకు ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో ఈనెల 17న (ఆదివారం) టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మనబోయిన నరేష్ శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన వారికి మొదటి బహుమతిగా రూ.5వేలు, షీల్డ్, ప్రశంస పత్రం, ద్వితీయ బహుమతి కింద రూ.4వేలు, షీల్డ్, ప్రశంస పత్రం, తృతీయ బహుమతి కింద రూ.3వేలు, షీల్డ్, ప్రశంస పత్రం, చతుర్ధ బహుమతి కింద రూ.2వేలు, షీల్డ్, ప్రశంసపత్రం, పంచమ బహుమతిగా రూ.1,000, షీల్డ్, ప్రశంసపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

మొక్కు తీర్చుకున్న కార్యకర్తలు

మునగాల : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన పలువురు ముస్లిం, మైనార్టీలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్‌లో తమ మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకుడు షేక్ జాఫర్మీయా మాట్లాడుతూ.. గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ అసమర్ధత పాలనలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందక అనేక ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వసే ప్రతిఒక్కరికి న్యాయం జరుగుతుందని, ఇందుకోసం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని తాము గతంలో మొక్కుకున్నానని, దీంతో జాన్‌పహాడ్ దర్గాలో తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై పాట చిత్రీకరణ

హుజూర్‌నగర్ : ప్రభుత్వాలు మారినా నిరుద్యోగుల బతుకులు మారడం లేదని ప్రజా నాట్యమండలి కళాకారుడు బాదే నరసయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో నిరుద్యోగులపై ఓ పాటను చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. పాట చిత్రీకరణలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.